కథ

# మా ఆయన మంచివారు

సరిగ్గా ఇంకో పది రోజులు. ఆపై తానూ ఓ ఇంటి వాడై పోతాడు. ఈ సంగతి తలుచుకున్నప్పుడల్లా ఆనంద్ మనస్సు పులకరించి పోతున్నది.

బీ.కాం. పూర్తి చేసిన ఆనంద్ హైదరబాదులోని ప్రైవేట్ కంపెనీలో నెలకి మూడు వేల రూపాయల జీతంతో పని చేస్తున్నాడు. తల్లిదండ్రులు వ్యవసాయం చేసుకుంటూ కాకినాడకు సమీపంలోని ఓ చిన్న పల్లెలో వుంటున్నారు. ఇతడు మాత్రం ఇద్దరు స్నేహితులతో ఓ గది అద్దెకు తీసుకుని వుంటున్నాడు.

'పెళ్ళి కాగానే తన పద్ధతులన్నీ పూర్తిగా మార్చుకోవాలి. బ్రహ్మచారులు వుండే గదిలా తన ఇంటిని వుంచుకోకూడదు' ఈ తలంపుతోటే హైదరాబాదులో వెయ్యి రూపాయల అద్దెతో అప్పుడే మూడు గదులున్న ఇంటిని కూడా చూసేశాడు.

'ఇల్లు చిన్నదిగా వున్నా, దానిని అందంగా వుంచుకోవాలి. సోఫా కలర్ నలగకుండా, బట్టలు ఈ గదిలో వున్నట్లుగా అక్కడా, ఇక్కడా అరెయ్యకుండా చూసుకోవాలి. ఆడియో కేసెట్‌లను ఇలా మూలకొక్కటి పడేయకుండా, వాటికంటూ ఓ రాక్‌ని కొని, అందులో అందగా సర్ది పెట్టాలి'.

'రోజు ఉదయం ఆరుగంటల లోపు స్నానం చేసి, ఓ గంట పాటు పేపర్ చదవటం అలవాటుగా పెట్టుకోవాలి. అంతేకాని, ఇప్పటిలా ఎనిమిది గంటలకు లేవడం, స్నానం చేయకుండానే ఆఫీసుకి వెళ్ళడం లాంటివి వుండకూడదు. ఉదయం మేమిద్దరం గుడికి వెళ్ళిరావాలి. ఇస్త్రీ చేసిన బట్టలనే వేసుకోవాలి. అసలు ఫలానా సమయంలో ఫలానా పని చేసేట్టు, అందుకోసం ఓ టైం టేబులుని తయారు చేసుకుని ఆ ప్రకారం నడుచుకోవాలి...' ఇలా మనస్సులో ఎన్నో పథకాలు'.

ఈ పద్ధతులు ఆనంద్‌కు ఎంత ఇష్టమైనా, బ్రహ్మచారులుండే ఈ గదిలో అవి అసాధ్యం. కాని ఇకపై ఆ సమస్య లేదు. కాబోయే భార్య విద్యావంతురాలు. పైగా మిలటరి కమాండెంటు కూతురు. కనుక డిసిప్లిన్ విషయంలో చెప్పనక్కర్లేదు.

* * *

ఎదురు చూసిన ఆ రోజు వచ్చేసింది. అది వారి మొదటి రాత్రి... భార్య కోసం ఎదురు చూస్తూ గదిలో కూర్చున్నాడు ఆనంద్. ఆమె రాగానే ఎలా ప్రవర్తించాలో ఆలోచించాడు. మొదట ఆమె భయాన్ని పోగొట్టి, నేనున్నానంటూ ధైర్యం చెప్పాలి. ఆ తరువాత...

తలుపు తీసిన చప్పుడైంది. తిరిగాడటువైపు. ఆమె!

"కూర్చో భవానీ..." తన పక్కన కూర్చో



బెట్టుకున్నాడు.

"పెళ్ళి నువ్వు కోరుకున్నట్లే జరిగిందా భవానీ?"

"ఆ...!"

"ఇదిగో చూడు! ముందు భయాన్ని అవతల పెట్టు. నేనేమన్నా పులినా? సింహాన్నా? ఎందుకలా భయపడుతున్నావు? నన్ను నీ స్నేహితుడిలా అనుకో. నువ్వు చదువుకున్న దానివి. నీకు బాధ కలిగించే పనేది చేయను. నాలాగే ఈ వైవాహిక జీవితం పట్ల నీ కంటూ అభిప్రాయలుంటాయని నాకు తెలుసు. నీ భావాలకు, ఆలోచనలకూ స్వేచ్ఛ వుంది. వాటిని ధైర్యంగా వివరించు. ఆ ప్రకారం మనం నడుచుకుందాం" అంటూ ఆమెని మరింత దగ్గరకు తీసుకున్నాడు.

"చెబితే ఏమనుకోరుగా?" మొట్ట మొదటిసారిగా నోరు విప్పింది భవాని.

"నేనింత దూరం వివరించిన తర్వాత కూడ నా ఈ ప్రశ్న?" ఆనంద్ కంఠం మృదువుగా, ప్రేమగా ధ్వనించింది.

"మీరింత ఫ్రాంక్‌గా మాట్లడడం నాకెంతో ఆనందంగా వుంది... మా నాన్నగారు మిలటరీలో పని చేస్తారని మీకు తెలిసిందే. ఆయన చాల ఖచ్చితంగా వుంటారు. మేమంతా ఉదయం ఆరు గంటలలోపు స్నానాలు చేసెయ్యాలి. ఓ గంట సేపైనా న్యూస్ పేపర్ చదవాలి. రోజు గుడికి వెళ్ళి రావాలి. ఇస్త్రీ చేసిన బట్టలే వేసుకుని వుండాలి. ఇంట్లో ఏ వస్తువు తీసిన చోటునే పెట్టేసెయ్యాలి. కుర్చీలు, సోఫాలు అందంగా వుంచాలి. సోఫా కవర్ కాస్త నలిగినా చాలు నాన్నగారికి చాల కోపం వచ్చేస్తుంది. అంతేకాదు నేనూ, మా తమ్ముడు, చెల్లెలూ అందరం గోలగా మాట్లడకూడదు. నవ్వకూడదు. ఆడపిల్లలు వినయ విధేయతతో నడుచుకోవాలంటారాయన. మొత్తం మీద మా ఇల్లు ఓ జైలు లాంటిది. మా నాన్నగారికి ఎదురు మాట్లాడితే ఆయన బెల్టుతోనే సమాధానమిస్తారు. నా కిదంతా కాస్త కూడా నచ్చదు. అయినా మా నాన్నగారిని ఎదిరించి ఏమీ మాట్లాడేదానిని కాను. సరే... ఇదంతా కొన్ని రోజులేగా? రేపు నాకు పెళ్ళయితే, కాబోయే భర్త మా నాన్నగారిలా కఠినంగా వుండరని సమాధానపడేదాన్ని.

నేననుకున్నట్టుగానే మీరున్నారు. మొట్ట మొదటగా నాతో ఎంతో ప్రేమగా మాట్లాడారు. మనమిద్దరం ఎప్పుడు ఇలాగే వుండాలండి. మనం కాపురం చేయబోయే ఇంట్లో వుండేది మనమిద్దరమే. కనుక ఎనిమిది గంటల వరకు హాయిగా నిద్రపోవచ్చు. మనకిష్టమొచ్చినట్లు వుండచ్చు. మిమ్మల్ని చూడగానే అనిపించింది...నా భర్త ఎంతో మంచివారని...!"

ఏకధాటిగా సాగిన ఆమె వాక్ప్రవాహం హఠాత్తుగా ఆగింది.

"ఏమండీ!...నేను ఎక్కువగా మాట్లేడేశానా?"

దిగ్భ్రాంతికి లోనైన ఆనంద్ "అబ్బే... లే...లేదు" అంటూ తేరుకున్నాడు.

—పి.వి.మురళీ కృష్ణ